విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా బోధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం

రాంగోపాల్‌పేట్: విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా బోధించాలని ఐఐటీ హైదరాబాద్ హెరిటేజ్ అండ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ కోరాడ సుబ్రహ్మణ్యం అన్నారు. సికింద్రాబాద్ ఎస్డీరోడ్‌లోని సెయింట్ ఆన్స్ బీఈడీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భారతీయ జ్ఞాన సంపద భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో సదస్సును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. భారతీయ జ్ఞాన సంపద లోతైనా జ్ఞాన రహస్యాలు వెలికితీయడానికి, భావి తరాలకు అందించడానికి పురాణాలు, ఇతిహాసాలు, వ్యాకరణ శాస్త్రం, నీతి కథలు ఉన్నాయని అన్నారు. భారతీయ విజ్ఞాన వ్యవస్థ ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ దాన్ని మనం పేటెంట్ చేసుకోలేకపోవడం వలన ప్రపంచానికి తెలియలేదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మేరీ కుట్టీ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎంబీఎస్సీ కులాల నిరసన దీక్ష


తుకారాంగేట్ మరాఠా బస్తీలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సమితి నాయకులు

అడ్డగుట్ట: జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు భైరి వెంకటేశం ఆధ్వర్యంలో ఈ నెల 21న ఇందిరాపార్క్‌లోని ధర్నా చౌక్‌లో ఎంబీఎస్సీ కులాల నిరసన దీక్ష చేపట్టనున్నట్లు ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉపదే సనాధన్ పేర్కొన్నారు. తుకారాంగేట్‌లోని మరాఠా బస్తీలో సమితి ఆధ్వర్యంలో దీక్ష పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ వర్గీకరణ కాకుండా కుల గణన జరిగిన తర్వాతే నూతన జనాభా లెక్కల ఆధారంగా వర్గీకరణ చేసి ఎంబీఎస్సీ కులాలకు 7 శాతం రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఎంబీఎస్సీ కులాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కుల ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్ ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి అరుణ్ లాల్, నాదే జిట్లాల్, గణేశ్ కజ్బే, ఉపాధి రత్తిలాల్, కమ్లే విజయ్, యూ మహేశ్, మోతీలాల్, కిషన్, మనోజ్ పాల్గొన్నారు.

నూతన వీసీకి అభినందనల వెల్లువ


ప్రొ ఇటిక్యాల పురుషోత్తమ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఓయూ అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ నూతన వీసీ ప్రొ.కుమార్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం మాదిగ విద్యార్థి ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) జాతీయ కార్యదర్శి పల్లెర్ల సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో వీసీని కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఓయూకు తొలిసారి మాదిగ ప్రొఫెసర్ వీసీగా నియమితులవడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎర్రం నాగేంద్రం, రఘువరణ మాదిగ, వెంకటేశ్ మాదిగ, నాజీవ్, ప్రదీప్, మహేందర్, విజయ్, అంజి, రవి మాదిగ పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌కు ..

లాలాపేట: రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తమ్‌ను ఆయన కార్యాలయంలో ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన పలువురు మాదిగ అసిస్టెంట్ ప్రొఫెసర్లు పలువురు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రొ పురుషోత్తమ్‌ను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు వెంకటరత్నం, పాలడుగు జీవన్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా అంతర్జాతీయ చెఫ్ వేడుకలు


అంతర్జాతీయ చెఫ్ వేడుకల్లో విద్యార్థినులు

సనత్‌నగర్: వృత్తివిద్యా కోర్సులకు ప్రాధాన్యత పెరుగుతోందని, ఆ దిశగా విద్యార్థులు ముందడుగు వేసి మరింత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే స్థాయికి చేరుకోవాలని తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి అండ్ ట్రైనింగ్ కార్యదర్శి పుల్లయ్య అన్నారు. అంతర్జాతీయ చెఫ్ డే పురస్కరించుకుని బేగంపేటలోని సీఏఐ కలనరీలో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పుల్లయ్య మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సుల డిమాండ్‌ను నేటితరం విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. కాగా చెఫ్ డే సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 80 మంది విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. అలాగే రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రతియేటా అక్టోబర్ 20న అంతర్జాతీయ చెఫ్ డే నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని సీఏఐ అకాడమీ విభాగం అధిపతి చెఫ్ కులకర్ణి తెలిపారు. ఈ ఏడాది గ్రోయింగ్ గ్రేట్ చెఫ్స్‌గా వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ చెఫ్స్ సొసైటీస్ ప్రకటించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అతివేగంతో పల్టీకొట్టిన కారు

ఒకరికి గాయాలు.. కేసు నమోదు



పంజగుట్ట: మద్యం మత్తులో కారును అతి వేగంగా నడపడంతో అదుపుతప్పి పల్టీకొట్టిన ఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బేగంపేట, బ్రాహ్మణవాడీలో ఉండే అక్కి వరుణ్ (22) (టీఎస్09ఎఫ్‌పీ 9593) నెంబర్ గల స్కోడా ర్యాపిడ్ కారులో ఎస్సార్‌నగర్‌లోని లీలానగర్‌లో ఉండే స్నేహితుడు నరేందర్‌తో కలిసి బంజారాహిల్స్‌కు వెళ్లారు. ఈ క్రమంలో నరేందర్‌ను లీలానగర్‌లో దింపేందుకు వెళ్తుండగా కారును వేగంగా నడపడంతో ప్రజాభవన్ పక్కనే ఉన్న మంజీరా గెస్ట్‌హౌస్ వద్ద కారు అదుపుతప్పి పల్టీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న వరుణ్ కుడిచేతికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు 100కు సమాచారం ఇవ్వగా వరుణ్‌ను బేగంపేటలోని మెడికవర్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రిలో వరుణ్‌కు బ్రీత్ అనాలిసిస్ పరీక్షలు నిర్వహించగా 110 ఎంజీ/ 100 ఎమ్ఎల్‌గా వచ్చింది. కారును, నరేందర్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీస్‌స్టేషన్‌లో నరేందర్‌కు పరీక్షలు నిర్వహించగా అతను మద్యం తీసుకోలేదని తేల్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరిస్థితిని అదుపు చేసేందుకే లాఠీచార్జి



డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్

కంటోన్మెంట్: సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ టెంపుల్ వద్ద హిందూ సంఘాల ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన ఆందోళన అదుపు తప్పుతున్న క్రమంలోనే తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు లాఠీ చార్జి చేయాల్సి వచ్చిందని నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ తెలిపారు. డీసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘటన వివరాలు వెల్లడించారు. పోలీసుల అనుమతి లేకుండానే ఉదయం ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో శాంతియుత నిరసన చేపట్టనున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. సున్నితమైన అంశం కావడంతో నిరసనకు అవకాశం ఇచ్చామన్నారు. దాదాపు 3వేలకు పైగా ఆందోళనకారులు ఒక్క చోట గుమిగూడారు. వీరిలో ఓ గ్రూపు మెట్రోపోలీస్ హోటల్ వైపునకు, మరో గుంపు ఆలయ సమీపంలోని మసీదు వైపునకు వెళ్లేందుకు ప్రయత్నించిందన్నారు. అదుపు చేసేందుకు మైక్‌లో అనౌన్స్ చేసినప్పటికీ ఆందోళనకారులు వినలేదన్నారు. వారిని అడ్డుకునేందుకు యత్నించిన పోలీసులపై చెప్పులు, రాళ్లతో దాడి చేయగా, సుమారు 15 మంది పోలీసులకు గాయాలయ్యాయి. పరిస్థితి అదుపు తప్పడంతో లాఠీచార్జికు ఆదేశించినట్లు తెలిపారు. కేసు విచారణలో ఎలాంటి పక్షపాతం లేకుండా దర్యాప్తు చేస్తామని తెలిపారు. నిందితుడి ఆరోగ్యపరిస్థితి కుదుట పడిన తర్వాత వెంటనే అరెస్టు చేస్తామన్నారు. ఈ విషయంలో సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని కోరారు. ఆలయ పునర్‌నిర్మాణానికి ప్రభుత్వ పెద్దలు కూడా హామీ ఇచ్చినట్లు తెలిపారు. మెట్రోపోలీస్ హోటల్‌లో జరిగిన సమావేశం పూర్వాపరాలు, పాల్గొన్న వారి వివరాలు సేకరిస్తున్నామన్నారు. త్వరలోనే పూర్తివివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

అసంపూర్తి పనులు.. అవస్థలు..!

- నార్త్‌లాలాగూడలో పెండింగ్‌లోనే సీసీ రోడ్డు నిర్మాణం
- ఏడాదిగా కాలనీవాసుల ఇక్కట్లు


లిల్లీ మోడల్ స్కూల్ సమీపంలో అధ్వానంగా రోడ్డు

అడ్డగుట్ట: అసంపూర్తి పనులతో కాలనీవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏడాదిగా ముందుకు సాగని రోడ్డు నిర్మాణంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని, ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని నార్త్‌లాలాగూడ వాసులు వాపోతున్నారు. అడ్డగుట్ట డివిజన్ నార్త్‌లాలాగూడలోని లిల్లీ మోడల్ స్కూల్ సమీపంలోని బస్తీలో తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్ల పనులు పూర్తి చేశారు. అయితే రోడ్డు వేయకుండా అలాగే వదిలేయడంతో అస్తవ్యస్తంగా, అధ్వానంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెందుతున్నారు.

పైప్‌లైన్ పనులు పూర్తయినా..

ఏడాది క్రితం పైప్‌లైన్ పనులు ప్రారంభించిన అధికారులు పూర్తి చేశారు. తరువాత రోడ్డు వేయకుండా వెళ్లిపోయిన అధికారులు ఇప్పటివరకు ఇటువైపు కూడా చూడడంలేదు. దీంతో సదరు రోడ్లు అస్తవ్యస్తంగా, గుంతలమయంలో మారాయి. రాత్రి సమయాల్లో వృద్ధులు అనేక అవస్థలు పడుతున్నారని, నడవలేక ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు.

రోడ్డుపక్కనే వ్యర్థాలు..

పైప్‌లైన్ పనుల తరువాత రోడ్డును అసంపూర్తిగా వదిలేసి వెళ్లిపోయిన సంబంధిత అధికారులు, పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్‌పై ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని బస్తీవాసులు కోరుతున్నారు. పైప్‌లైన్ కోసం రోడ్డు తవ్విన క్రమంలో వచ్చిన వ్యర్థాలను రోడ్డు పక్కనే వేసి వెళ్లిపోయారు. దీంతో వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారని పేర్కొంటున్నారు.


గుంతల రోడ్డుపై నిలిచిన మురుగునీరు

డ్రైనేజీ, మురుగునీటి నిల్వతో దుర్వాసన..

పైప్‌లైన్ పనుల్లో భాగంగా డ్రైనేజీ మ్యాన్ హోళ్లు కూడా పూర్తిగా డ్యామేజ్ అయ్యాయని, అందులో నుంచి పొంగిపొర్లుతున్న మురుగునీరు గుంతల్లో నిలిచిపోయి ఉండడంతో దుర్వాసనను తట్టుకోలేక పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, అసలే విష జ్వరాలు ప్రబలుతున్న తరుణంలో నిర్లక్ష్యపు పనుల కారణంగా ఆరోగ్య పరంగా ప్రమాదకర పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలున్నాయని స్థానికులు వాపోతున్నారు.

చాలా ఇబ్బందులు పడుతున్నాం



బస్తీలో పైప్‌లైన్ పనులు పూర్తయిన తరువాత సంబంధిత శాఖ అధికారులు రోడ్డు వేయకుండా అలాగే వెళ్లిపోయారు. ఇప్పటికీ దాదాపు ఏడాది గడిచింది. గుంతలమయంగా ఉన్న రోడ్డుపై నడవలేకపోతున్నాం. పైగా గుంతల్లో డ్రైనేజీ, మురుగు నీరు చేరుతుండడంతో దుర్వసన వస్తోంది. నీళ్లు వచ్చినప్పుడు బస్తీ పూర్తిగా బురద మయంగా మారుతోంది. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు వేయాలి.

– శంకర్, స్థానికుడు

సీఎంను కలిసిన శివకుమార్


సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న శ్రీరామ్ శివకుమార్

లాలాపేట: సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శ్రీరామ్ శివకుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. నామినేటెడ్ పదవుల్లో తమకు అవకాశం కల్పించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ ఉద్యోగుల మధ్యఘర్షణ

రసూల్‌పురా: విద్యుత్ ఉద్యోగుల మధ్య జరిగిన గొడవలో ఒకరు తీవ్రంగా గాయపడిన ఘటన తిరుమలగిరి పీఎస్ పరిధిలో జరిగింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లాల్‌బజార్ సెక్షన్‌లో లైన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, లైన్‌మెన్ రాము విధులు నిర్వహిస్తున్నారు. శనివారం సెక్షన్ కార్యాలయంలో ఇరువురి మధ్య గొడవ జరిగి మాటమాటా పెరగగా ప్రసాద్ ఇనుపరాడ్‌తో రాము తలపై దాడి చేశాడు. దీంతో తలకు తీవ్రగాయాలు కావడంతో రాము పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల సూచన మేరకు తోటి ఉద్యోగులు రామును హుటాహుటిన గాంధీ దవాఖానకు చికిత్స కోసం తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం యశోదలో చేర్పించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న అన్ని ప్రాజెక్టులను యుద్ధ ప్రతిపాదికలపై పూర్తి చేయాలని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి పుల్లూరు వెంకటరాజేశ్వరరావు కోరారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో అనేక ప్రాజెక్టు పెండింగ్‌లో ఉండటం వల్ల రైతులకు సాగునీరు ప్రజలకు తాగునీరు అందడం లేదని అన్నారు. శనివారం దళ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని సూచించారు. పాలమూరు, రంగారెడ్డి వంటి అనేక ప్రాజెక్టులు ఇంకా పూర్తి కాలేదని ఆయన అన్నారు. వెంటనే నిధులు కేటాయించి యుద్ధ ప్రతిపాదికన పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి కొత్త ప్రాజెక్టులకు టెండర్లు పిలవాలని కోరారు. ఈ సమావేశంలో పీ.వీ. శ్రీనివాసరావు, సంకీర్తన తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్

బంజారాహిల్స్: పార్కుల్లో పచ్చదనం-పరిశుభ్రత పెంపొందించే కార్యక్రమంలో భాగంగా జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్-18 అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. శనివారం వినాయకనగర్ పార్కులో పేరుకుపోయిన చెత్తా చెదారం, ఎండిపోయిన ఆకులు, ఇతర వ్యర్థాలను తొలగించారు. సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతితో పాటు పారిశుద్ధ్య విభాగం సిబ్బంది ఇందులో పాల్గొన్నారు.

మానసిక ఒత్తిళ్లతో అనారోగ్యం


సమావేశంలో పాల్గొన్న డాక్టర్ హన్మంతరావు, సైక్రియాట్రిస్టులు

రాంగోపాల్‌పేట్: మానసిక ఒత్తిళ్లతో అనారోగ్యం నెలకొంటుందని స్వీకార్ ఉపకార్ చైర్మన్ డాక్టర్ హన్మంతరావు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సూర్యటవర్స్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానసికవ్యాధిగ్రస్తుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాల్సిన బాధ్యత సైకాలజిస్టులపై ఉందన్నారు. సైకాలజిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ రాంచందర్, సైకియాట్రిస్టులు డాక్టర్లు ప్రీతి స్వరూప్, హరిణి, అర్చన పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


డిప్యూటీ మేయర్‌ను కలిసిన ఇంజినీరింగ్ అధికారులు

లాలాపేట: సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వెంకటసాయి తార్నాకలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, అలాగే సికింద్రాబాద్ అభివృద్ధికి కృషి చేయాలని డిప్యూటీ మేయర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ సువర్ణ, ఏఈ వేణు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ


నూతన ఉపాధ్యాయులను సత్కరించిన ప్రధానోపాధ్యాయురాలు స్వరూప

పద్మారావునగర్: విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని భోలక్‌పూర్ మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూప, పూర్వ హెచ్‌ఎం మల్లికార్జున్ రెడ్డి అన్నారు. శనివారం పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం స్వరూప మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రతిరోజు పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ దాతల సహకారంలో విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అదేవిధంగా 2024 డీఎస్సీ ద్వారా టీచర్లుగా ఎంపికై పాఠశాలలో చేరిన 10 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి బీ నర్సింగ్‌రావు, కోశాధికారి వీజే శేషగిరిరావుతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీసీల నియామకాల్లో అన్యాయం


ఓయూలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: వీసీల నియామకాల్లో అన్యాయం జరిగిందని ఓయూలో ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) రాష్ట్ర అధ్యక్షుడు మంచాల లింగస్వామి ఆధ్వర్యంలో మాల విద్యార్థులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలుపు కోసం మాల నాయకులు, సంఘాల మద్దతు తీసుకొని గెలిచాక పదవులకు దూరంగా పెడుతున్నారని ధ్వజమెత్తారు. అంబేద్కర్, జేఎన్‌టీయూ (ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ)కి మాల ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నామ సైదులు, దుగ్గి సురేశ్, గాజుల నవీన్ తదితరులు పాల్గొన్నారు

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ. 41, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 28, బెండకాయ 50, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 75, క్యాప్సికం 75, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 26, క్యారెట్ 40, దొండ 28, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 25, దోసకాయ 35, బీట్‌రూట్ 31, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 37, చామగడ్డ 45, మొరంగడ్డ 35, కందగడ్డ 60, సొరకాయ 17, పొట్లకాయ 23, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు ప్రత్యేక పూజలు

సనత్‌నగర్: సంకటహర చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్, గణపతి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, సాయంత్రం 6 గంటలకు పంచామృతాభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణ దర్శనం తదితర పూజా కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు.

సంతకు విశేష స్పందన


సంతలో ఏర్పాటు చేసిన స్టాల్స్

లాలాపేట: గ్రామభారతి, సీఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తార్నాకలోని మత్రికృష్ణా హాల్లో శనివారం నిర్వహించిన నాలుగో మూలం సంతకు స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. ఇందులో దాదాపు 50 వరకు వ్యవసాయ గోఆధారిత ఉత్పత్తులను విక్రయానికి అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మార్కెట్‌లో కల్తీలతో అనారోగ్యాల పాలవుతున్న నేపథ్యంలో క్రిమీ సంహారక మందులు వాడని వ్యవసాయ ఉత్పత్తులను రైతుల ద్వారా నేరుగా వినియోగదారులకు అందించి వారు ఆరోగ్యంగా ఉండాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ సూర్యకళ, లింగం గౌడ్, కరుణాకర్ గౌడ్, బొమ్మకంటి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో గిరిజనులకు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో గిరిజనులకు అన్యాయం, అవమానం జరుగుతుందని బీఆర్ఎస్ నాయకుడు కరాటే రాజు పేర్కొన్నారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 10 వర్సిటీలకు వీసీలను నియమించగా అందులో ప్రాధాన్యతలేని మహిళా వర్సిటీకి ఎస్టీ అధ్యాపకురాలను ప్రొ.సూర్యను ఇన్‌చార్జిగా నియమించారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రివర్గంలో ఎస్టీ నేతకు అవకాశం కల్పించకపోవడం బాధకరమన్నారు. రాష్ట్రంలో 12 శాతం గల గిరిజనులతో సీఎం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. గిరిజన మంత్రిని నియమించకుంటే సీఎం రేవంత్ రెడ్డిని గద్దె దించడం ఖాయమన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



సనత్‌నగర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బేగంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బేగంపేట ఎస్ఐ జయచందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ సమీపంలోని పిల్లర్ నంబర్ 1361 వద్ద ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి డయల్ 100కు సమాచారం ఇచ్చారు. వెంటనే బేగంపేట పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని సదరు వ్యక్తిని ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి ఆచూకీ తెలియలేదని, సుమారు 40-45 మధ్య వయస్సు ఉంటుందని పోలీసులు తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గంజాయి విక్రయిస్తున్న వృద్ధురాలి అరెస్టు

సనత్‌నగర్: గంజాయి విక్రయిస్తున్న వృద్ధురాలిని బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన వివరాలను ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు వెల్లడించారు. ఫతేనగర్‌లోని ఓ ఇంట్లో గంజాయి విక్రయిస్తున్నట్లుగా అందిన సమాచారం మేరకు శనివారం ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. జతిన్‌బీ(70) అనే వృద్ధురాలిని అరెస్టు చేసి ఆమె నుంచి 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సనత్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అమీర్‌పేట: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ శ్రీనగర్‌కాలనీ సమీపంలోని శాలీవాహన కాలనీకి చెందిన కోనేరు అరుణ్‌కుమార్ (43) ఈ నెల 16న వ్యక్తిగత పనిమీద బైక్‌పై బయటకు వెళ్లాడు. రాత్రి 10 గంటల సమయంలో ఎర్రగడ్డ పిల్లర్ నెం.972 వద్దకు యూటర్న్ తీసుకుంటుండగా సనత్‌నగర్ నుంచి అమీర్‌పేట వైపు వస్తున్న త్రినాథ్ పలమణి అనే అపోలో మెడిసన్ డెలివరీ బాయ్ అరుణ్‌కుమార్ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో అరుణ్ కింద పడగా తలకు తీవ్రగాయం అయ్యింది. స్థానికులు ఫోన్ నంబర్ ఆధారంగా కుమారుడు మనోహర్ ప్రసాద్‌కు సమాచారం అందించారు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని తండ్రిని అమీర్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాడు. పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు. కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలుడి అదృశ్యం


నర్సింహ

సనత్‌నగర్: దివ్యాంగుడైన బాలుడు అదృశ్యమైన ఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కృష్ణాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. భరత్‌నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నరేశ్ స్థానికంగా శ్రీసత్యసాయి కృప హోమ్స్ పేరిట అనాథ ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నాడు. అందులో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో కృపహోమ్‌కు చెందిన నర్సింహ (14) బేగంపేటలోని శ్రద్ధ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం 8.10 గంటలకు శివాలయానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో నరేశ్ స్థానికంగా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.